క్లుప్తంగా

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: పంటలను ప్రకృతి సేద్యం పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మందస మండల సమైఖ్య కార్యాలయంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంతో నవధాన్యాలు పంట సాగు పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు వల్ల పంట దిగుబడితో పాటు భూమి మరింత సారవంతంగా మారుతుందన్నారు. రైతులు నవధాన్యాల సాగుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం 12 రకాల విత్తనాలతో 80 కిట్లు తయారు చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీసీ కిషోర్, ఎంటీ సంజీవరావు, లక్ష్మణరావు, బాలకృష్ణ, మురళీకృష్ణ, కృపసింధ్, రైతులు పాల్గొన్నారు.

భూలోక మాత ఉత్సవాలకు పందిరిరాట



పందిరిరాట వేస్తున్న మహిళలు

టెక్కలి: స్థానిక భూలోకమాత వీధిలో ఈ నెల 14 నుంచి జరగనున్న భూలోకమాత ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం పందిరిరాట వేశారు. మాజీ సర్పంచ్ బెహరా కృష్ణవేణి ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల నేతృత్వంలో అమ్మవారికి పూజలు చేసి పందిరిరాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ముగ్రాటలతో చల్లదనం చేశారు.

వైభవంగా చింతామణి సంబరం



కవిటిలో చింతామణి అమ్మవారి ఊరేగింపు

కవిటి: ఉద్దాన ప్రజల ఆరాధ్యదైవం, కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి కవిటి పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చల్లదనం ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపమైన గజముద్ద, కాళీమాత వేషధారణలు, మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం గ్రామశివారులోని చింతామణి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

చురుగ్గా మండప నిర్మాణం



పాలపోలమ్మ ఆలయం వద్ద మండపం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 3వ వార్డులో జయరామచంద్రపురంలో పాలపోలమ్మ ఆలయం వద్ద విశ్రాంత మండప నిర్మాణం జరుగుతోంది. ఆలయానికి వచ్చే భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు గ్రామానికి చెందిన పిన్నింటి నాగేశ్వర రెడ్డి, హైమావతి దంపతులు రూ.లక్షా యాభై వేలతో దీనిని నిర్మించారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని దాతలు తెలిపారు.

సుదర్శన క్రియతో ప్రశాంతత



మాట్లాడుతున్న జిల్లా ప్రతినిధి డాక్టర్ అమ్మన్నాయుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ సెంటర్‌లో సుదర్శన క్రియపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు యోగా టీచర్ దేసూళ సురేంద్ర తెలిపారు. ఈ నెల 11 వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. శ్వాసకు సంబంధించి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సుదర్శన క్రియ సాధనతో మానసిక, ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని, ఒత్తిడి లేని జీవితం సొంతమవుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు తెలిపారు. రోజులో రెండు పూటలు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు 7989752675 నంబరును సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



టెక్కలి :విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నందిగాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ విజ్ఞాన శిబిరం ముగిసింది. లైబ్రేరియన్ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో మే 15న శిబిరం ప్రారంభించారు. చిన్నారులకు చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వం, ఖోఖో, కబడ్డీ, క్రికెట్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, సైన్స్ ఎక్స్‌పో, ఫ్రాగ్ జంప్, పత్రికా పఠనం తదితర పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి ముగింపు సందర్భంగా శుక్రవారం నందిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యర్నాగుల హరిబాబు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలను చదివి జ్ఞానం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కుమారస్వామి, గ్రంథాలయ సహాయకురాలు రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. చిత్రలేఖనం, పత్రికా పఠనం, క్విజ్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి, విశ్రాంత ఉపాధ్యాయుడు జి.మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాశీబుగ్గ : మందస శాఖా గ్రంథాలయంలో మే 15 నుంచి జూన్ 7 వరకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు ముగిశాయని లైబ్రేరియన్ జె.విజయలక్ష్మి తెలిపారు. ఆటల పోటీలు, కథలు, పుస్తక పఠనం, క్విజ్ తదితర పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో నవీన్, లక్ష్మినారాయణ, కమలాకర్, ప్రకాష్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: మందస గ్రంథాలయంలో చిన్నారులు, నిర్వాహకులు



నందిగాం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం హరిబాబు

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



కీర్తిపురంలో అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ ప్రతాప్

ఇచ్ఛాపురం రూరల్: బ్యాంకు లావాదేవీలకు సంబంధించి వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని ఆర్థిక అక్షరాశ్యత కేంద్రం కౌన్సిలర్ ఎస్.ప్రతాప్ అన్నారు. శుక్రవారం పాయితారి–కీర్తిపురంలో రిజర్వ్ బ్యాంక్ డిపాజిట్ ఎడ్యుకేటర్ అండ్ అవేర్నెస్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో బ్యాంకు ఖాతాదారులకు సైబర్ నేరాల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులకు వెళ్లే సమయంలో అపరిచిత వ్యక్తులకు పాస్ పుస్తకాలు ఇవ్వడం గానీ, ఓటీపీ నంబర్లు చెప్పడం గానీ చేయకూడదన్నారు. ఏటీఎం కేంద్రాల్లో ఇతరులకు కార్డులు, పిన్ నంబర్లు చెప్పకూడదన్నారు.

ఇతరులు ఫోన్ చేసి బ్యాంకు, ఆధార్ నెంబర్లు చెప్పాలని అడిగితే అస్సలు స్పందించవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో వెలుగు కంప్యూటర్ ఆపరేటర్ పి.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషకు సన్మానం



గౌతు శిరీషకు సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

కాశీబుగ్గ: మొదటిసారి పలాస శాసన సభ్యురాలిగా ఎన్నికైన గౌతు శిరీషను ఆంధ్రప్రదేశ్ కాష్యూ మ్యానుఫ్యాక్చరర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం పలాసలోని ఎమ్మెల్యే నివాసంలో సత్కరించారు. జీడి పరిశ్రమల అభివృద్ధికి, కార్మికులకు, వ్యాపారులకు అండగా నిలవాలని కోరారు. పలాస, హరిపురం, టెక్కలి, చాపర ప్రాంతాలలో సుమారు 300 జీడి ప్రోసెసింగ్ పరిశ్రమలు ఉన్నాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మంది బతుకుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏపీసీఎం ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు, జనరల్ సెక్రటరీ కుసుముంచు సుబ్బరాయులు, కోశాధికారి పత్తి ముత్తుకుమార్, సభ్యులు మల్లా రామేశ్వరం, తాళాసు శ్రీనివాసరావు, డోకి వెంకటరమణ, శాశనపురి మురళీకృష్ణ, మల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల విజయోత్సవం



ఎన్టీఆర్, యర్రన్నాయుడు విగ్రహాలకు పాలాభిషేకాలు చేస్తున్న కార్యకర్తలు

టెక్కలి: టెక్కలిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు టెక్కలిలో టీడీపీ అభ్యర్థి కె.అచ్చెన్నాయుడు విజయం సాధించడంతో టీడీపీ మండల అధ్యక్షుడు బి.శేషగిరి ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలంతా దివంగత నాయకులు ఎన్.టి.రామారావు, కింజరాపు యర్రన్నాయుడు విగ్రహాలకు పాలాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కె.లవకుమార్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



పలాసపురంలో నవధాన్యాల కిట్లు తయారీ పరిశీలిస్తున్న ఏపీఎం రమణమ్మ

సోంపేట : మండలంలోని రైతులు భూసారాన్ని పెంచుకోవడానికి ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని స్వయం సహాయక సంఘాల ఏపీఎం రమణమ్మ అన్నారు. మండలంలోని పలాసపురంలో యూనిట్ స్థాయిలో నవధాన్యాల విత్తనాల కిట్లు తయారీ కార్యక్రమాన్ని శుక్రవారం ఏపీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ పంటలు సాగు చేసే ముందు నవధాన్యాలు భూమిలో చల్లుకుని, కలియదున్నడం వల్ల అనేక లాభాలు చేకూరుతాయని వివరించారు. వరి పంటకు ముందు 12 కిలోల విత్తనాలు, జీడి మామిడి కొబ్బరి తోటల్లో 6 కిలోల విత్తనాలు చల్లుకోవాలన్నారు. వీటి ద్వారా నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, మొక్కలకు అవసరమైన సూక్ష్మపోషకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సజ్జలు సాగుతో అదనపు ఆదాయం



రైతులకు నవ ధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కంచిలి: ఖరీఫ్ పంట వేసేముందు రైతులు సజ్జలు సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ శివానందం అన్నారు. శుక్రవారం అంపురంలో నవధాన్యాల కిట్లు తయారీపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ఆలస్యంగా కురిసే అవకాశాలు ఉండటంతో ఖరీఫ్ పంటను వేసే ముందు సజ్జలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పి.ఉమారాణి, కామరాజు, ఐసీఆర్‌పీ మీనా, భవానీ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ



జగతి ఆర్బీకే వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న వ్యవసాయ సహాయకుడు శ్రీకల్యాణ్

కవిటి:వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై వరి విత్తనాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో ఖరీఫ్ సాగు నేపథ్యంలో వరివిత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జోరుగా సాగుతోంది. దీనిలో భాగంగా శుక్రవారం కవిటి, జగతి తదితర సచివాలయాల పరిధిలో రైతులు వరివిత్తనాల కోసం వివరాలు రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 7029, మార్టూరు 1318, బీపీటీ 5204(సాంబమసూరి), ఆర్‌జీఎల్2537(శ్రీకాకుళం సన్నాలు) రకాలను రైతులకు కిలోకు రూ.10 రాయితీపై అందించేందుకు వ్యవసాయశాఖ కార్యాచరణ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రైతులు తమకు అవసరమైన విత్తనాల కోసం సచివాలయాల ఆర్బీకేల వద్ద నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు. ఇప్పటికే పచ్చికొట్ట విత్తనాలు పంపిణీ చేశామని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అభ్యాసకుల యోగా



నిర్వాహకులతో ఎమ్మెల్యే గొండు శంకర్

నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శుక్రవారం సూర్య పతంజలి యోగా వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అభ్యాసకులు పలు యోగాసనాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో యోగా నిర్వాహకురాలు శ్రీదేవి, రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథం, బొడ్డేపల్లి దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

\- శ్రీకాకుళం కల్చరల్

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కవిటి: మండలంలోని రాజపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరానికి గానూ 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలని ప్రిన్సిపాల్ మాడెం ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15న రాతపరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయలేకపోయిన విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకు కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

21 నుంచి కనకదుర్గమ్మ యాత్ర మహోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో వెలిసిన కనకదుర్గమ్మ అమ్మవారి యాత్ర మహోత్సవాలు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆలయ ధర్మకర్త డోల రామారావు, రామలక్ష్మి తదితరులు శుక్రవారం ఆవిష్కరించారు. యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

ఫీజులను నియంత్రించాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

జి.సిగడాం: కార్పొరేట్ విద్యాలయాల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా నాయకుడు చిత్తిరి రాజు అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తే ఉద్యమం చేస్తామని చెప్పారు. ఆనందపురం గ్రామంలో ఎస్ఎఫ్ఐ లక్ష్యాలతో కూడిన పుస్తకాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించాలని, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో పుస్తకాలు, పెన్నులు ఇతర రూపంలో అధికంగా ఫీజులు వసూళ్లు చేయడాన్ని అరికట్టాలన్నారు. విద్యారంగాల్లో వస్తున్న మార్పులపై ఈ నెల ఎనిమిది నుంచి 16 వతేదీ వరకు శ్రీకాకుళం చింతాడ రోడ్డులో ఉన్న జీఎల్ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పి.మనోహర్, సీహెచ్ విద్య, పి.దుర్గాప్రసాద్, కె.మనిషా తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్, ఎర్రన్న విగ్రహాలకు పాలాభిషేకం



నివాళులర్పిస్తున్న బోయిన రమేష్, టీడీపీ నాయకులు

కోటబొమ్మాళి: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో కోటబొమ్మాళి పాతబస్టాండ్ వద్ద ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు మంచి పరిపాలన అందించేందుకు కలిసికట్టుగా కృషిచేద్దామని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోరాడ గోవిందరావు, మజ్జి కృష్ణారావు, మూగు అచ్చెయ్యరెడ్డి, మెట్ట మోహన్, మంగి రమణ, ఏలూరు బైరాగి, దాసరి నాగరాజు పాల్గొన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

టెక్కలి: పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు నిర్వహిస్తున్న సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



బలగ గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వావిలాల జగన్నాథంనాయుడు, జనరల్ సెక్రటరీ మణిశర్మ, జర్నలిస్ట్ సంఘ ప్రతినిధి కొంక్యాణ వేణుగోపాల్‌రావులు మాట్లాడుతూ శిక్షణ తరగతులకు హాజరుకావడం వల్ల కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఇలాంటి తరగతులు రాబోయే రోజుల్లోనూ నిర్వహించాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన, గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరికి గాజుల అలంకరణ

బలగలోని బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శుక్రవారం బాలా త్రిపుర సుందరి అమ్మవారిని గాజులతో అలంకరించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

\- శ్రీకాకుళం కల్చరల్

